


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




మంగళవారం 06-01-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 212 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## ట్రంప్ నెక్స్ట్ టార్గెట్ గ్రీన్లాండ్


2 లో


## ఢిల్లీ గాలిలో ప్రమాదకర బాక్టీరియా


2 లో

## ఓఎన్జీసీ డ్రిల్ సైట్ నుంచి గ్యాస్ లీక్



2 లో

## క్రూజ్ ట్రిప్ పేరుతో భారీ మోసం.. కాచిగూడ వాసికి రూ. 2.42 లక్షల టోకరా



2 లో

## జనసేన సంచలన నిర్ణయం.. తెలంగాణలో పార్టీ కమిటీలన్నీ రద్దు


2 లో

## వివాహేతర సంబంధం.. పోలీసు స్టేషన్ ఎదుటే దారుణం


2 లో

## భగ్గుమన్న పాతకక్షలు.. ఇద్దరి హత్య, చిన్నారికి తీవ్ర గాయాలు..!



2 లో

## అతి తెలివి ఎక్కువ.. పని తక్కువ:

# బీఆర్ఎస్ పాలనపై మంత్రి ఉత్తమ్ ఫైర్


2 లో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టు అంతర్రాష్ట్ర నదీ జలాల నిబంధనలకు విరుద్ధమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇవాళ ఆయన అసెంబ్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టును అన్ని వేదికలపై తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ విషయంలో ఇప్పటికే కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కి లేఖ రాశామని, తమ అభ్యంతరాలను బోర్డు కూడా సమర్థించిందని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టును కేవలం తెలంగాణే కాదు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కూడా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఈ వివాదంపై సుప్రీంకోర్టు లో గట్టిగా వాదనలు వినిపించాలని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సూచించామని అన్నారు. కోర్టు సూచన మేరకు దీనిని సూట్ పిటిషన్‌గా దాఖలు చేస్తున్నామని, వచ్చే సోమవారం జరిగే విచారణకు తాను స్వయంగా హాజరవుతానని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుపై వెంటనే స్టే ఇవ్వాలని కోర్టును కోరనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం..

# 10 లక్షల మంది విద్యార్థులకు ఉచిత ల్యాప్ టాప్‌లు


2 లో

అతి త్వరలో తమిళనాడు రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో డిఎమ్‌కే ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై వారాల జల్లు కురిపిస్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే రేషన్ కార్డుదారులకు సంక్రాంతి కానుకతో పాటు రూ. 3000 లను అందిస్తుంది. అలాగే ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉలగం ఉంగల్ కైయిల్ (ప్రపంచం మీ చేతుల్లో) అనే ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం స్టాలిన్ సిద్ధం అయ్యారు. ఈ రోజు ప్రారంభం కానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 10 లక్షల మంది కళాశాల విద్యార్థులకు ఉచితంగా లాప్ టాప్ లను పంపిణీ చేయనున్నారు.

విద్యార్థులను డిజిటల్ పరంగా బలోపేతం చేయడం, వారికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించేలా ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం వెల్లడించింది. ఈ పథకం కింద ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, అగ్రికల్చర్, మెడికల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారు.

# నెక్స్ట్ మీ సంగతి చూస్తా.. ప్రపంచ దేశాలను ఆదోళన పెట్టిస్తున్న ట్రంప్ తాజా హెచ్చరికలు


2 లో

రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక డొనాల్డ్ ట్రంప్ చర్యలు ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక సమీకరణాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ట్రంప్ అనుసరిస్తున్న దౌత్య నీతి, విదేశాంగ విధానం టెన్షన్ పెట్టిస్తున్నాయి. తాను అనుకున్నది సాధించుకునేందుకు ప్రపంచ పెద్దన్న అనుసరిస్తున్న తీరు అందరిని ఆశ్చర్యంలోకి నెట్టుతున్నాయి. ఈ క్రమంలో వెనిజులాపై సైనిక చర్యల తప్పదని గత కొంతకాలంగా చెబుతూ వస్తున్న ట్రంప్ చివరకు అన్నంత పనిచేశారు. ఆపరేషన్ అబ్సల్యూట్ రిసాల్వ్ పేరుతో అమెరికా సైన్యం చేపట్టిన సైనిక ఆపరేషన్‌లో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో , ఆయన భార్య సిలోయో ఫ్లోరెస్ ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ప్రపంచ రాజకీయాల్లో వెనిజులా అధ్యక్షుడి నిర్బంధం తీవ్ర దుమారం రేపుతున్న వేళ ట్రంప్ తన నెక్స్ట్ టార్గెట్ ను సైతం ఫిక్స్ చేసుకోవడం హాట్ టాపిక్ గా మారింది.

మీ పని కూడా చూస్తాం:

వెనిజులా అధ్యక్షుడు మదురో దంపతులను నిర్బంధించి న్యూయార్క్ జైలుకు తరలించిన మరుసటి రోజు ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు ప్రపంచ దేశాలను షాక్ కు గురి చేస్తున్నాయి. మదురో అరెస్టు విషయాన్ని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఖండిస్తూ వాషింగ్టన్ చర్యను లాటిన్ అమెరికా సార్వభౌమాధికారంపై దాడిగా అభివర్ణించాడు. ఈ మాటలు ట్రంప్‌కు కోపం తెప్పించినట్లున్నాయి. దీంతో పెట్రో వ్యాఖ్యలపై స్పందించిన ట్రంప్.. కొలంబియా అధ్యక్షుడిని ఉద్దేశించి జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. అతను (పెట్రో) కొకైన్ తయారు చేస్తున్నాడు. వాటిని అమెరికాకు పంపిస్తున్నాడు. ఇక మీ ప్రవర్తనను జాగ్రత్తగా చూసుకోండి అని ఆయనకు ట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

## స్టేట్ పాలిటిక్స్‌లో సరికొత్త సెన్సేషన్..

# కొత్త పార్టీపై కవిత సంచలన ప్రకటన



2 లో

ఉద్యమ ద్రోహులంతా బీఆర్ఎస్ పార్టీలో చేరారంటూ ఎమ్మెల్సీ కవిత సంచలనాత్మక వ్యాఖ్యలు చేశారు. సోమవారం శాసన మండలిలో ప్రసంగించిన అనంతరం ఆమె గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో అందరూ కలిసికట్టుగా పనిచేశారని, అధికారం వచ్చాక అసలైన ఉద్యమకారులను బీఆర్ఎస్ నుంచి అన్యాయంగా బయటకు పంపారని విమర్శించారు. తనపై కొందరు కక్షకట్టి కట్టడి చేశారని, రాజకీయంగా ఎదగకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఏపీ ఉల్లంఘనలపై

# సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు




- పోలవరంఉనల్లమల సాగర్‌పై సుప్రీంకోర్టులో తెలంగాణ పిటిషన్
- ఏపీఉతెలంగాణ మధ్య నీటి వివాదంపై కీలక విచారణ
- పరివాహక రాష్ట్రాల అభిప్రాయాలు తప్పనిసరి: సీజేఐ వ్యాఖ్యలు
- మధ్యవర్తిత్వంతో పరిష్కారం సాధ్యమేనా? సుప్రీంకోర్టు ప్రశ్న
- వరద జలాల వినియోగం కేటాయింపులకు విరుద్ధం: సింఘ్వీ వాదనలు
- ప్రాజెక్టు నివేదికపై అభ్యంతరమేంటి? ముకుల్ రోహిత్గి ప్రశ్న
- జాతీయ ప్రాజెక్టులపై కేంద్రానిదే న్యాయపరిధి
- విచారణను ఈ నెల 12కు వాయిదా వేసిన ధర్మాసనం

మిగతావి 2 లో

తెలంగాణ , ఏపీ మధ్య నీటి పంచాయితీ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం వద్ద సోమవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ తరఫున వాదనలు కొనసాగాయి. ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాది జగదీశ్ గుప్తా వాదనలు వినిపించారు. పోలవరం ప్రాజెక్టు నివేదిక, అధ్యయనానికి కేంద్రం నుంచి అనుమతి ఉందని తెలిపారు. తెలంగాణ మాత్రం గోదావరి పై వందల ప్రాజెక్టులు నిర్మిస్తోందని వాదనలు వినిపించారు.

## భారత్-ఇజ్రాయెల్ వాణిజ్యం ఇకపై రూపాయిల్లోనే..



2 లో

భారత్, ఇజ్రాయెల్ మధ్య వ్యూహాత్మక సంబంధాలు బలపడుతున్న నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయెల్‌లో శాఖ కలిగిన ఏకైక భారతీయ బ్యాంకు అయిన ఎస్‌బీఐ, ఇకపై ఇరు దేశాల మధ్య జరిగే వాణిజ్య లావాదేవీలను భారతీయ రూపాయిల్లో నిర్వహించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చలు జోరందుకున్న తరుణంలో ఈ నిర్ణయం వాణిజ్య రంగానికి ఊతమివ్వనుంది.

## బైక్ ప్రమాదం.. బయటపడ్డ 20 కిలోల గంజాయి!


2 లో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లో సోమవారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదం గంజాయి స్మగ్లింగ్‌ను బయటపెట్టింది. అతివేగమే ప్రమాదానికి కారణం కాగా, ఈ ఘటనలో సుమారు 20 కిలోల గంజాయి పోలీసులకు చిక్కింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం భద్రాచలం నుంచి సారపాక వైపు ఒక ద్విచక్ర వాహనం అతివేగంగా వస్తోంది.సారపాక సెంటర్ ప్రాంతానికి చేరుకోగానే, వాహనం అదుపుతప్పి కింద పడిపోయింది.

# స్టేట్ పాలిటిక్స్‌లో సరికొత్త సెన్సేషన్.. కొత్త పార్టీపై కవిత సంచలన ప్రకటన

మొదటి పేజీ తరువాయి

తొమ్మిదిన్నరేళ్లలో 14 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టి అందులో రూ.12 లక్షల కోట్లు ఖర్చు చేస్తే 1.89 లక్షల కోట్లు కేవలం నీటి పారుదల రంగానికి వినియోగించారని ఫైర్ అయ్యారు. పదేళ్లు అధికారంలో ఉండి ఎందుకు నిరుపేదలకు ఇళ్లు ఇవ్వలేకపోయారో బీఆర్ఎస్ పెద్దలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే తనను అవమానకరంగా పార్టీ నుంచి బహిష్కరించారని కవిత ఆరోపించారు.

రాష్ట్రంలో కొత్త రాజకీయ వేదిక రాబోతోంది..

పార్టీలో ఉన్న ఎంతోమంది ఆశలు అడియాశలు అయ్యాయని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. నేడు అన్ని బంధనాలు తెంచుకుని తాను బయటకు వచ్చానని పేర్కొన్నారు. ఇది కేవలం తన ఆత్మగౌరవం కోసం జరుగుతున్న పోరాటం కాదని.. ప్రజా సమస్యలపైనే తన పోరాటమని అన్నారు. తనలాగే తెలంగాణ ఆడబిడ్డలకు రోషం ఎక్కువని, యువత కోసం కొత్త రాజకీయ వేదిక రాబోతోందని తెలిపారు. వామపక్ష నేతలు, మావోయిస్టు సానుభూతిపరులు, ప్రజాస్వామ్యవాదులు తమతో పనిచేయాలనుకునే వారందరికీ 'తెలంగాణ జాగృతి' ఆహ్వానం పలుకుతోందని తెలిపారు. తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారబోతోందని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో జాగృతి కూడా పోటీలో ఉంటుందని, ప్రజల పక్షన మళ్లీ చట్టసభల్లో అడుగుపెడతామని అన్నారు. మహిళల హక్కుల కోసం తనను ప్రజలంతా ఆశీర్వదించాలని కవిత గన్‌పార్క్ వేదికగా సంచలన ప్రకటన చేయడం ప్రస్తుతం స్టేట్ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# బైక్ ప్రమాదం.. బయటపడ్డ 20 కిలోల గంజాయి!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లో సోమవారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదం గంజాయి స్మగ్లింగ్‌ను బయటపెట్టింది. అతివేగమే ప్రమాదానికి కారణం కాగా, ఈ ఘటనలో సుమారు 20 కిలోల గంజాయి పోలీసులకు చిక్కింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం భద్రాచలం నుంచి సారపాక వైపు ఒక ద్విచక్ర వాహనం అతివేగంగా వస్తోంది. సారపాక సెంటర్ ప్రాంతానికి చేరుకోగానే, వాహనం అదుపుతప్పి కింద పడిపోయింది.ఈ ప్రమాదం జరిగిన సమయంలో బైక్‌పై ఉన్న బ్యాగులు కిందపడిపోవడంతో, అందులో ప్యాక్ చేసి ఉన్న సుమారు 20 కేజీల గంజాయి బయటపడింది.దీన్ని చూసిన స్థానికులు ఒక్కసారిగా అవాక్కయ్యారు.

ఒకరు పరారీ.. మరొకరు పోలీసుల అదుపులో...!

ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన నిందితుల్లో ఒకరు అక్కడి నుంచి చాకచక్యంగా పరారయ్యారు. అయితే, ద్విచక్ర వాహనంపై ఉన్న రెండో వ్యక్తిని స్థానికుల సహకారంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదుపులో ఉన్న వ్యక్తిని విచారించడం ద్వారా ఈ గంజాయి ఎక్కడి నుంచి వస్తోంది? ఎక్కడికి తరలిస్తున్నారు? అనే వివరాలు సేకరిస్తున్నారు. ఈ స్మగ్లింగ్ వెనుక ఇంకా ఎవరి ప్రమేయం ఉందనే కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు.

# ఏపీ ఉల్లంఘనలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

ఇందుకు సీజేఐ మాట్లాడుతూ పరివాహక రాష్ట్రాల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అందరి అభిప్రాయాలతోనే తదుపరి విచారణ కొనసాగిస్తామని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చు కదా అని సీజేఐ ప్రశ్నించారు. విచారణను వాయిదా వేశారు.

తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు

మరోవైపు తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం వరద జలాలే వాడుకుంటామని చెబుతోందని, కేటాయింపులకు విరుద్ధంగా నీటి వినియోగం సాధ్యపడదని వివరించారు. అంతేకాదు ఇందుకు సంబంధించి చాలా విషయాలు ముడిపడి ఉన్నాయని సింఘ్వీ కోర్టుకు తెలిపారు. విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ అని, ప్రాజెక్టులన్నీ ఇప్పుడు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసిన తర్వాత కేంద్రం నియమించిన కమిటీ అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఇరు వర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు

అయితే ఇరు వర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు జడ్జి సంచలన వ్యాఖ్యలు చేశారు. కమిటీ ఏర్పాటు చేశారని తమరే చెబుతున్నారని తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కమిటీని అన్ని విషయాలపై నివేదిక ఇవ్వనీయండని వ్యాఖ్యానించారు. సివిల్ సూట్‌లో జోక్యం చేసుకుని నిలుపుదల చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా అని ప్రశ్నించారు.

మధ్యంతర ఉపశమనం కల్పించాలి

అయితే మధ్యంతర ఉపశమనం కల్పించాలని తెలంగాణ తరఫున సింఘ్వీ కోరారు. ఇందుకు సీజేఐ రిప్లై ఇస్తూ ఆంధ్రప్రదేశ్ కేవలం ప్రాజెక్టు నివేదిక కోసమే టెండర్లు పిలవాలని చూస్తోందని తెలిపారు. జాతీయ ప్రాజెక్టుల విషయంలో కేంద్రానికి న్యాయపరిధి ఉంటుందని సీజేఐ తెలిపారు.

ఏపీ లాయర్ ముకుల్ రోహిత్గి వాదనలు

ఏపీ ప్రభుత్వం భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టు నివేదికపై అభ్యంతరమేంటని ఏపీ లాయర్ ముకుల్ రోహిత్గి ప్రశ్నించారు. ఏపీ ఇల్లు.. ఆ రాష్ట్రం కట్టుకోవాలంటే మిగిలిన వాళ్ల అభ్యంతరమేంటని నిలదీశారు. తన భూభాగంలో నిర్మించే ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుంటే అభ్యంతరం ఎందుకో చెప్పాలన్నారు. రాయలసీమలో కరువు ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లడానికే ప్రాజెక్టు ప్రతిపాదన అని ముకుల్ పేర్కొన్నారు. ఎక్కడా, ఏ ఉత్తర్వులు, తీర్పులు, ఉల్లంఘనలు ఈ ప్రాజెక్టులో లేవని ముకుల్ తెలిపారు.

అభ్యంతరాలను పరిగణించండి: సీజేఐ

ఇందుకు పరివాహక ప్రాంత రాష్ట్రాల అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోవాలని సీజేఐ సూచించింది. పోలవరం ప్రాజెక్టు వల్ల ఏ ఒక్క రాష్ట్రానికి నష్టం జరగదని ఇందేరకు ముకుల్ సమాధానమిచ్చారు. దీంతో విచారణను ధర్మాసనం ఈ నెల 12కు వాయిదా వేసింది.

# ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం.. 10 లక్షల మంది విద్యార్థులకు ఉచిత ల్యాప్ టాప్‌లు

అతి త్వరలో తమిళనాడు రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో డిఎమ్‌కే ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై వారాల జల్లు కురిపిస్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే రేషన్ కార్డుదారులకు సంక్రాంతి కానుకతో పాటు రూ. 3000 లను అందిస్తుంది. అలాగే ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉలగం ఉంగల్ కైయిల్ (ప్రపంచం మీ చేతుల్లో) అనే ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం స్టాలిన్ సిద్ధం అయ్యారు. ఈ రోజు ప్రారంభం కానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 10 లక్షల మంది కళాశాల విద్యార్థులకు ఉచితంగా లాప్ టాప్ లను పంపిణీ చేయనున్నారు.

విద్యార్థులను డిజిటల్ పరంగా బలోపేతం చేయడం, వారికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించేలా ప్రోత్సహించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం వెల్లడించింది. ఈ పథకం కింద ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, అగ్రికల్చర్, మెడికల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. వీరికి అందించే ల్యాప్ టాప్‌లు అత్యాధునిక ఫీచర్లతో రూపొందించబడ్డాయి. ఇవి ఇంటెల్ కోర్ ఐ3 (లేదా) ఏఎండీ రైజెన్ 3 ప్రాసెసర్, 8 జీబీ ర్యామ్, 256 జీబీ ఎస్ఎస్‌డీ స్టోరేజ్, విండోస్ 11 ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తాయి. వీటితో పాటు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి అవసరమైన మైక్రోసాఫ్ట్ ఆఫీస్, ఇతర కోడింగ్ సాఫ్ట్‌వేర్లను కూడా ఇందులో ముందుగానే ఇన్‌స్టాల్ చేసి అందిస్తున్నారు. రాబోయే రెండేళ్లలో మొత్తం 20 లక్షల మంది విద్యార్థులకు ల్యాప్ టాప్ లను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం దాదాపు రూ. 2,000 కోట్లను కేటాయించారు. మొదటి విడతలో డిగ్రీ, పీజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. మరికొద్ది నెలల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, యువతను ఆకట్టుకోవడంలో ఈ పథకం కీలకం కానుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో ఉన్న పాఠశాల విద్యార్థులకు ల్యాప్ టాప్ పథకాన్ని ఇప్పుడు ఉన్నత చదువులు చదివే కళాశాల విద్యార్థులకు వర్తింపజేస్తూ డీఎంకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

# అతి తెలివి ఎక్కువ.. పని తక్కువ: బీఆర్ఎస్ పాలనపై మంత్రి ఉత్తమ్ ఫైర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన పోలవరం–నల్లమల సాగర్ ప్రాజెక్టు అంతర్రాష్ట్ర నదీ జలాల నిబంధనలకు విరుద్ధమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇవాళ ఆయన అసెంబ్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. పోలవరం–నల్లమల సాగర్ ప్రాజెక్టును అన్ని వేదికలపై తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ విషయంలో ఇప్పటికే కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కి లేఖ రాశామని, తమ అభ్యంతరాలను బోర్డు కూడా సమర్థించిందని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టును కేవలం తెలంగాణే కాదు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కూడా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఈ వివాదంపై సుప్రీంకోర్టు లో గట్టిగా వాదనలు వినిపించాలని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సూచించామని అన్నారు. కోర్టు సూచన మేరకు దీనిని సూట్ పిటిషన్‌గా దాఖలు చేస్తున్నామని, వచ్చే సోమవారం జరిగే విచారణకు తాను స్వయంగా హాజరవుతానని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుపై వెంటనే స్టే ఇవ్వాలని కోర్టును కోరనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్ఎస్ వైఫల్యాలపై ధ్వజం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలో ప్రదర్శించిన నిర్లక్ష్యం వల్ల తెలంగాణకు భారీ నష్టం వాటిల్లిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం చారిత్రక తప్పిదమని మండిపడ్డారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చడం ద్వారా ప్రాజెక్టు వ్యయం పెరగడమే తప్ప ప్రయోజనం లేకపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో పాలన అతి తెలివి ఎక్కువ.. పని తక్కువ అన్న చందగా నడిచిందని కామెంట్ చేశారు. వారి నిర్ణయాల వల్ల కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని ఫైర్ అయ్యారు. ఇక హరీష్ రావు చూపిస్తున్న లేఖలు ప్రస్తుత పరిస్థితులకు సంబంధించినవి కావని మంత్రి కొట్టిపారేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గట్టిగా ఒత్తిడి తీసుకురావడం వల్లే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను ఆపివేసిందని ఆయన స్పష్టం చేశారు. గతంలో పనులు జరుగుతున్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం ఒకటి రెండు రోజుల్లో మరోసారి న్యాయవాదులతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

# భారత్-ఇజ్రాయెల్ వాణిజ్యం ఇకపై రూపాయిల్లోనే.. ఎస్‌బీఐ కీలక ముందడుగు

భారత్, ఇజ్రాయెల్ మధ్య వ్యూహాత్మక సంబంధాలు బలపడుతున్న నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయెల్‌లో శాఖ కలిగిన ఏకైక భారతీయ బ్యాంకు అయిన ఎస్‌బీఐ, ఇకపై ఇరు దేశాల మధ్య జరిగే వాణిజ్య లావాదేవీలను భారతీయ రూపాయిల్లో నిర్వహించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చర్చలు జోరందుకున్న తరుణంలో ఈ నిర్ణయం వాణిజ్య రంగానికి ఊతమివ్వనుంది.

అంతర్జాతీయ వాణిజ్యంలో రూపాయి వినియోగాన్ని పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ చర్యలు చేపట్టినట్లు ఎస్‌బీఐ ఇజ్రాయెల్ సీఈవో వి. మణివన్నన్ తెలిపారు. ఈ కొత్త విధానం ద్వారా ఇజ్రాయెల్ కంపెనీలు ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన చెల్లింపులను నేరుగా రూపాయిల్లోనే జరపవచ్చు. దీనికోసం స్పెషల్ రూపాయి వోస్ట్రో అకౌంట్ విధానాన్ని వినియోగించనున్నట్లు, తద్వారా ఇజ్రాయెల్ విక్రేతలు, కొనుగోలుదారులు సులభంగా లావాదేవీలు జరపవచ్చని ఆయన స్పష్టం చేశారు.

# ట్రంప్ నెక్స్ట్ టార్గెట్ గ్రీన్లాండ్

ఇప్పటికే వెనుజులాను ఆక్రమించుకున్న అమెరికా.. తన నెక్స్ట్ టార్గెట్ గ్రీన్లాండ్ అని స్పష్టం చేసింది. ఓ మీడియా ఇంటర్వ్యూలో అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. మాకు గ్రీన్లాండ్ అవసరం అయితే అది రక్షణ కోసం మాత్రమేనంటూ మరో బాంబ్ పేల్చారు. ట్రంప్ నెక్స్ట్ టార్గెట్ గ్రీన్లాండ్ అని క్లారిటీ ఇచ్చినట్టు అర్థం అవుతోంది. అయితే గ్రీన్లాండ్‌ను అమెరికా ఆధీనంలోకి తీసుకోవాలనే అంశాన్ని ట్రంప్ తొలిసారి 2019లో వ్యక్తీకరించాడు. అప్పట్లో డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడెర్సిన్ ఈ ఆలోచనను పూర్తిగా తిరస్కరిస్తూ "ఇది వెర్రి ప్రతిపాదన" అని వ్యాఖ్యానించారు. గ్రీన్లాండ్ డెన్మార్క్‌కు చెందిన ప్రాంతమే అయినప్పటికీ.. అక్కడ స్వయంపాలన వ్యవస్థ ఉంది.ట్రంప్ మాత్రం ఆర్కిటిక్ ప్రాంతంలో గ్రీన్లాండ్ ఉన్న వ్యూహాత్మక స్థానం, ఖనిజ సంపద, భద్రతా అవసరాల కారణంగా అది అమెరికాకు అవసరమని అప్పట్లో చెప్పాడు. తాజాగా మళ్లీ ఈ అంశం చర్చకు వచ్చింది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో అరెస్టు తర్వాత... ది అట్లాంటిక్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాకు గ్రీన్లాండ్ అవసరం, అయితే అది చమురు కోసం కాదు. కేవలం రక్షణ కోసం మాత్రమే అని వ్యాఖ్యానించాడు. అలాగే 2025 డిసెంబర్‌లో లూసియానా గవర్నర్ జెఫ్ లాండ్రీని గ్రీన్లాండ్‌కు స్పెషల్ ఎన్వాయ్‌గా నియమించడం యూరప్ దేశాల్లో ఆందోళన కలిగించింది. దీనికి తోడు ట్రంప్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ స్టీఫెన్ మిల్లర్ భార్య కేటీ మిల్లర్ సోషల్ మీడియాలో గ్రీన్లాండ్‌పై అమెరికా జెండా ఫోటో పెట్టి "త్వరలో" అని క్యాప్షన్ ఇవ్వడం మరింత వివాదానికి దారితీసింది.

# ఢిల్లీ గాలిలో ప్రమాదకర బాక్టీరియా

ఢిల్లీలో వాతావరణ కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. తాజాగా ఢిల్లీ గాలిలో ప్రమాదకర బ్యాక్టీరియాను జేఎన్‌యూ సైంటిస్టులు గుర్తించారు. యాంటీ బయాటిక్స్‌కు సైతం లొంగని సూపర్ బగ్ అని నిర్ధారించారు. ఢిల్లీలోని మురికివాడలు, రద్దీ ప్రాంతాల్లో బాక్టీరియా జీవం పోసుకుంటున్నట్లు గుర్తించారు. WHO పరిమితి కంటే 16 రెట్లు అధిక ప్రమాదకరం అని.. అందరూ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. న్యూమోనియా, బ్లడ్ ఇన్‌ఫెక్షన్లకు కారణం అవుతుందని సూచించారు.

# జనసేన సంచలన నిర్ణయం.. తెలంగాణలో పార్టీ కమిటీలన్నీ రద్దు

జనసేన పార్టీ అధిష్టానం సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో జనసేన కమిటీలను రద్దు చేస్తూ.. వాటి స్థానంలో అడ్ హాక్ కమిటీలను నియమించింది. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు జనసేన పార్టీ ఎక్స్ అధికారిక ప్రకటన చేసింది. తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు పవన్ కల్యాణ్ సూచనల మేరకు కమిటీల్లో మార్పులు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది.

ఐదుగురు సభ్యులతో లిస్ట్ రెడీ చేయనున్న అడ్ హాక్ కమిటీలు

జీహెచ్ఎంసీ, వీరమహిళ, యువజన, విద్యార్థి విభాగ కమిటీలను రద్దుచేసి, వాటి స్థానంలో కొందరు సభ్యులతో తాత్కాలికంగా అడ్ హాక్ కమిటీలను నియమిస్తున్నట్లు వెల్లడించింది. అడ్ హాక్ కమిటీలు 30 రోజులపాటు పనిచేస్తాయని, ప్రతి నియోజకవర్గం, జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 300 వార్డుల్లో కమిటీలు పర్యటించి ఐదుగురు సభ్యులతో జాబితాను సిద్ధం చేసి పార్టీ కార్యాలయం దృష్టికి తీసుకురానున్నట్లు వివరించింది. త్వరలోనే పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేలా నూతన కమిటీలను ప్రకటిస్తామని పేర్కొంది. జనసేన తీసుకున్న ఈ నిర్ణయంతో తెలంగాణలో కొత్త జోష్ వస్తుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. పవన్ నాయకత్వంలో తెలంగాణలో జనసేన పార్టీ మరింత చురుకుగా ముందుకు సాగుతుందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. పార్టీ అధిష్టానం తీసుకున్న ఏ నిర్ణయానికైనా కట్టుబడి పనిచేస్తామని చెబుతున్నారు.

# ఓఎన్జీసీ డ్రిల్ సైట్ నుంచి గ్యాస్ లీక్

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మరోసారి గ్యాస్ పైపులైను నుంచి గ్యాస్ లీకైంది. ఈ ఘటన జిల్లాలోని మలికిపురం మండలంలోఉన్న ఓఎన్జీసీ పైపులైనులో జరిగింది. పైపులైను నుంచి లీకైన గ్యాస్ ఒక్కసారిగా గాలిలోకి ఎగజిమ్మింది. దీంతో మంటలు చెలరేగి భయానక వాతావరణాన్ని సృష్టించాయి. ఒక్కసారిగా గ్యాస్ పైపులైను లీకయ్యి మంటలు ఎగజిమ్ముతుండడంతో స్థానిక గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న మండల తహశీల్దార్ శ్రీనివాస రావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్యాస్ లీకవుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన సమాచారాన్ని ఓఎన్జీసీ అధికారులు తెలియజేసినట్లు తహశీల్దార్ తెలియజేశారు. సంస్థకు సంబంధించిన సాంకేతిక నిపుణులు త్వరలోనే సంఘటనా స్థలానికి చేరుకుంటారన్నారు. వారు గ్యాస్ లీకును అరికడతారని ప్రకటించారు. అయితే గతేడాది ఆగస్టులో కూడా మలికిపురం మండలంలోని ఇరుసుమండ సమీపంలో ఓఎన్జీసీ గ్యాస్ పైపులైను లీకయ్యింది. తరచూ గ్యాస్ లీక్ అవుతున్న సంఘటనలు వెలుగు చూస్తుండడం పట్ల మండలవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తగిన భద్రతా చర్యలు తీసుకొని లీకేజీలు జరగకుండా చూడాలని కోరుతున్నారు. లేదంటే ప్రమాదకర పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బ్రతకాల్సి వస్తుందని అంటున్నారు.

# క్రూజ్ ట్రిప్ పేరుతో భారీ మోసం.. కాచిగూడ వాసికి రూ. 2.42 లక్షల టోకరా

ఆన్‌లైన్‌లో సరదాగా క్రూజ్ యాత్ర బుక్ చేసుకోవాలనుకున్న ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల చేతిలో దారుణంగా మోసపోయారు. డిసెంబర్ 26న బాధితుడు కొచ్చి, లక్షద్వీప్, ముంబై వెళ్ళడానికి గూగుల్‌లో సెర్చ్ చేసి ఒక నకిలీ వెబ్‌సైట్‌ను ఆశ్రయించారు. అది నిజమైనదే అని నమ్మి నలుగురికి టికెట్లు బుక్ చేస్తూ మొదట రూ. 23,680 చెల్లించారు. ఆ తర్వాత నేరగాళ్లు లక్షద్వీప్ పర్మిట్ లెటర్లని, పిల్లల ఛార్జీలని నమ్మించి విడతల వారీగా డబ్బులు గుంజారు. పేమెంట్ ఫెయిల్ అయ్యిందని, టెక్నికల్ సమస్యలని సాకులు చెబుతూ.. రీఫండ్ కావాలంటే ముందుగా క్యాన్సిలేషన్ ఛార్జీలు కట్టాలని వాట్సాప్ ద్వారా వేధించారు. ఇలా మొత్తం రూ. 2,42,488 పోగొట్టుకున్న బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

ఈ ఘటనపై స్పందించిన హైదరాబాద్ సీపీ సజ్జనార్.. వాట్సాప్ ఛానెల్ ద్వారా ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. క్రూజ్ ప్యాకేజీలను కేవలం అధికారిక వెబ్‌సైట్లు, గుర్తింపు పొందిన ట్రావెల్ ఏజెంట్ల ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని సూచించారు. టెక్నికల్ సమస్యల పేరుతో మళ్లీ మళ్లీ డబ్బులు అడిగినా, వాట్సాప్ ద్వారా కస్టమర్ కేర్ అని చెప్పి ఫోన్ చేసినా నమ్మవద్దని హెచ్చరించారు. నిజమైన కంపెనీలు రిఫండ్ ఇవ్వడానికి క్యాన్సిలేషన్ ఛార్జీలు ముందుగా అడగవని స్పష్టం చేశారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా 87126 65171 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరారు.

# వివాహేతర సంబంధం.. పోలీసు స్టేషన్ ఎదుటే దారుణం

వివాహేతర సంబంధం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకోగా.. మరో కుటుంబంలో చిచ్చు పెట్టింది. దీంతో రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. సభ్య సమాజం తలదించుకునే ఇటువంటి సంఘటన శ్రీ సత్యసాయి జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఈశ్వరప్ప (25) అనే యువకుడు ఓ వివాహితను ప్రేమ పేరుతో నమ్మించాడు. ఆమెను తన వెంట తీసుకెళ్లాడు. నెల్లూరు జిల్లాలోని గూడూరులో మకాం పెట్టాడు. అయితే వివాహిత కుటుంబ సభ్యులు విషయం తెలుసుకొని ఆందోళనకు గురయ్యారు. తనకల్లు పోలీసులను ఆశ్రయించారు. విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తనకల్లు పోలీసులు వివాహిత భర్త హరిని తమ వెంట బెట్టుకొని గూడూరుకు వెళ్లారు. అక్కడ ఈశ్వరప్పతో పాటు వివాహితను గుర్తించారు. వారిని గూడూరు నుంచి తనకల్లుకు పోలీసుల వాహనంలో తరలించారు. ఈ క్రమంలో వాహనం తనకల్లు పోలీసు స్టేషనుకు చేరుకోగానే వివాహిత కుటుంబ సభ్యులు ఆగ్రహావేశాలకు గురయ్యారు. ఈశ్వరప్ప వాహనం నుంచి కిందకు దిగగానే పదునైన వస్తువులతో దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో ఈశ్వరప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ షాకింగ్ ఘటన నుంచి తేరుకున్న పోలీసులు పరిస్థితులను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అయితే పోలీసు స్టేషన్ ఎదుటే హత్య జరగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తనకల్లు పోలీసుల తీరుపై వివిధ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# మావోయిస్టులకు తెలంగాణ డీజీపీ మరో పిలుపు




దండకారణ్యంలో మిగిలిపోయిన 17 మంది తెలంగాణ మావోయిస్టు లకు డీజీపీ శివధర్ రెడ్డి మరో కీలక పిలుపునిచ్చారు. పునరావాసం కల్పించడంతో పాటు, వారి మీదున్న రివార్డులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అడవుల్లో ఉండి పోరాటం చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయని.. అనవసరంగా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కాగా, పీఎల్‌జీఏ బెటాలియన్‌లో 400 మందికి పైగా మావోయిస్టులు ఉండేవారని.. ఇప్పుడు వారి సంఖ్య 66కు చేరిందన్నారు డీజీపీ. ఈ సంఖ్యను బట్టిచూస్తే పీఎల్‌జీ పూర్తిగా క్షణించినట్లు అర్థమవుతోందన్నారు. రాజిరెడ్డి లొంగుబాటుతో ఇంకా ఒకరు మాత్రమే తెలంగాణ రాష్ట్ర కమిటీ వారు మావోల్లో మిగిలారని వివరించారు. సీఎం పిలుపుతో మావోయిస్టులు లొంగిపోతున్నారని డీజీపీ తెలిపారు. డివిజన్ సభ్యులకు రూ.5 లక్షలు, ఏరియా సభ్యులకు రూ.4 లక్షలు, మిగతా సభ్యులకు రూ.1 లక్ష రివార్డు అందజేస్తామని భరోసా ఇచ్చారు.

# భగ్గుమన్న పాతకక్షలు.. కందనాతిలో రక్తపాతం.. ఇద్దరి హత్య, చిన్నారికి తీవ్ర గాయాలు..!




రాయలసీమలో మరోసారి పాతకక్షలు భగ్గుమన్నాయి. కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామంలో పాతకక్షలు హింసాత్మకంగా మారాయి. ప్రత్యర్థుల దాడిలో ఇద్దరు వ్యక్తులు హత్యకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటేష్ అనే వ్యక్తిని పొలంలో, పరమేష్‌ను ఇంట్లో ప్రత్యర్థులు హత్య చేశారు. పొలం పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో శివారులో కాపు కాచి గోవింద్ (45), వీరేషమ్మ దంపతులపై వేటకొడవళ్లతో దాడి జరిగింది.

ఈ ఘటనలో వీరేషమ్మ కుమారుడు ఐదేళ్ల బాలుడు లోకేంద్రకు తీవ్ర గాయాలు కాగా.. గోవింద్ భార్య వీరేషమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గోవింద్ పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత ఏడాది ఇంటి వద్ద కుళాయి నీటి విషయంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో కేసన్న వర్గానికి చెందిన ఇద్దరు మృతి చెందారు. ఆ ఘటనకు ప్రతీకారంగానే ఇవాళ ఈ దాడి జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం కందనాతి గ్రామంలో పోలీసు బలగాలు మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాయి.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
www.edikadanijam.com

# నవాబుపేట మండలంలో నూతన హోటల్ ప్రారంభం



ఇది కద నిజం, నవాబుపేట్: నవాబుపేట్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన హోటల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా సీఐ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎస్ఐ పుల్లిక్ రవీందర్ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేష్ మాట్లాడుతూ, హోటల్ నిర్వహణలో యజమానులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా వంటగదిలో గ్యాస్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అనుసరించాలని తెలిపారు. అదేవిధంగా వినియోగదారులకు శుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించాల్సిన బాధ్యత హోటల్ యాజమాన్యంపై ఉందన్నారు. ఆహార భద్రత, పరిశుభ్రతపై ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని హోటల్ నిర్వహణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోటల్ యజమానులు, సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

# మందు బాబులకు అడ్డాగా మాదిరెడ్డిపల్లి బస్టాప్

- మాదిరెడ్డి పల్లి గ్రామ బస్టాప్ పూర్తిగా అధ్వాన స్థితికి చేరింది
- బస్టాప్ వద్ద బహిరంగ మద్యం, సిగరెట్ తాగడం నిత్యకృత్యంగా మారింది
- మద్యం సీసాలు పగలగొట్టడంతో ప్రయాణికుల భద్రతకు ముప్పు ఏర్పడుతోంది
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు
- తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



ఇది కద నిజం, నవాబుపేట్: నవాబుపేట్ మండల పరిధిలోని మాదిరెడ్డి పల్లి గ్రామంలో ఉన్న బస్టాప్ పూర్తిగా అధ్వాన స్థితికి చేరింది. బస్టాప్ పరిసరాలు అస్తవ్యస్తంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాప్ వద్ద బహిరంగంగా మద్యం సేవించడం, సిగరెట్లు తాగడం నిత్యకృత్యంగా మారిపోయింది. మద్యం సీసాలు అక్కడే పగలగొట్టడంతో పరిసర ప్రాంతమంతా గాజు ముక్కలతో నిండిపోయి, ప్రయాణికులు, విద్యార్థులు, మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సుల కోసం ఎదురుచూసే ప్రజలకు అక్కడ నిలబడటమే కష్టంగా మారింది. బస్టాప్ వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడం, అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి వచ్చే అతిథులు, ప్రయాణికుల ముందు ఈ పరిస్థితి గ్రామానికి చెడ్డ పేరును తెస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడం అధికారుల వైఫల్యానికి నిదర్శనమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి బస్టాప్‌ను మరమ్మతులు చేయడం, పరిశుభ్రత చర్యలు చేపట్టడం, మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కుక్కునూరు జనసేన అధ్యక్షుడి గొప్ప మనసు



ఇది కద నిజం,కుక్కునూరు: జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ములిశెట్టి యుగంధర్ గొప్ప మనసును చాటుకున్నారు. మండల కేంద్రం అయిన కుక్కునూరు గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆయన సంక్రాంతి పండుగ కానుకగా నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా ములిశెట్టి యుగంధర్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు కష్టపడి పని చేస్తేనే గ్రామాల్లోని ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని, అదే సమయంలో గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతాయని అన్నారు. అలాగే, రాబోయే రోజుల్లోనూ కార్మికులంతా చక్కగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా సంక్రాంతికి సొంత ఇళ్లకు వచ్చే వారందరూ మెచ్చుకునేలా పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని యుగంధర్ వారిని కోరారు. ఈ కార్యక్రమంలో కుక్కునూరు పంచాయతీ సెక్రెటరీ పీ ధర్మ గోవిందు, పారిశుధ్య కార్మికులు వేల్పుల మహేష్, మాచర్ల శ్రీను, కనుకు కృష్ణార్జునరావు, వేల్పుల రాములమ్మ, ముయ్యేటీ గంగలు పాల్గొన్నారు.

# తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన నాన్ చెరువు తండా సర్పంచ్ వెంకట్ నాయక్



ఇది కద నిజం: రాజాపూర్ మండల పరిధిలోని నాన్ చెరువు తండా నూతన సర్పంచ్ వెంకట్ నాయక్ తిరిగి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో చేరారు. సోమవారం హైదరాబాద్‌లోని జడ్చర్ల మాజీ శాసనసభ్యులు, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సర్పంచిగా ఎన్నికైన అనంతరం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వెంకట్ నాయక్, తాజాగా రాజకీయ నిర్ణయం మార్చుకొని తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరడం గమనార్హం. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి వెంకట్ నాయక్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. పార్టీలో చేరిన అనంతరం వెంకట్ నాయక్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ విధానాలు, నాయకత్వం తనను ఆకర్షించాయని, నాన్ చెరువు తండా అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

# పేదల వైద్య సేవలకు ప్రాముఖ్యత

## : మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్




ఇది కద నిజం,సికింద్రాబాద్ : నిరుపేదలకు వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తామని, విద్య, వైద్య రంగాలను పేదలకు చేరువలో నిలుపుతామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 20 మంది లబ్దిదారులకు సుమారు 9 లక్షల విలువజేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సితఫలమండీ లోనే ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్ సోమవారం కార్పొరేటర్లు, అధికారులు, నేతలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను అందించడంలో తాము అగ్ర స్థానంలో నిలుస్తామని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రజల సమస్యల పరిష్కారానికి సితఫలమండీ లోని తమ క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను పొందేందుకు దళారీలను ఆశ్రయిన్చారాదని, ఎవరికీ డబ్బులు చెల్లించరాదని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, రాసురి సునీత తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా పరమహంస యోగానంద జయంతి వేడుకలు

- అజ్ఞానమనే చీకటిని తొలగించే వాడే గురువు
- ధ్యానంతో ఆనందం మీ సొంతం
- క్షమాగుణం దైవ లక్షణం
- సాధన అంటే మంచి గుణాలు అలవరాచుకోవడమే
- భగవంతుడి నిశ్శబ్ద స్వరమే గురువు ఖి తిరుపతిలో నూతన ధ్యాన మందిరం ప్రారంభం
- ప్రారంభించిన యోగదా సత్సంగ సొసైటీ ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానంద



ఇది కద నిజం,హైదరాబాద్, తిరుపతి: యోగదా సత్సంగ సొసైటీ వ్యవస్థాపకుడు, ఒక యోగి ఆత్మకథ రచయిత పరమహంస యోగానంద జయంతి వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. హైదరాబాద్ మధురానగర్ లోని సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్ లో వైఎస్ ఎస్ భక్తులు క్రియాయోగ ధ్యానం, భజనలు, పుష్పాంజలి నిర్వహించారు. తిరుపతి నలందా నగర్ లో నూతన ధ్యాన కేంద్రాన్ని వైఎస్ ఎస్ స్వామి స్మరణానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజ్ఞానమనే చీకటిని తొలగించే వాడే గురువని చెప్పారు. భగవంతుడి నిశ్శబ్ద స్వరమే గురువని, సాధన అంటే దయ, క్షమ, సేవా తత్పరత అలవరచుకోవడమే నన్నారు.

పరమహంస యోగానంద జీవిత విశేషాలు

పరమహంస యోగానంద ముకుంద లాల్ ఘోష్ గా 1893 జనవరి 5న భారతదేశంలోని గోరఖ్ పూర్ లో, ఆధ్యాత్మిక నిబద్ధత గల తల్లిదండ్రులైన భగవతి చరణ్ ఘోష్, జ్ఞానప్రభా ఘోష్ లకు జన్మించారు. చిన్న వయస్సు నుంచే ఆయన ప్రార్థన, ధ్యానంపై ఆకర్షితులయ్యారు, నిగూఢమైన ఆంతరిక అవస్థలను అనుభూతి చెందారు, దివ్యకాంతి దర్శనాలతో సహా. వీటిని ఆయన తర్వాత ఒక యోగి ఆత్మకథ లో ప్రస్తావిస్తూ, దేవుణ్ణి అన్వేషించాలనేదే అన్నిటికన్నా ముఖ్యమని తనలో శాశ్వత నిశ్చయం రూపొందించిన సందర్భాలుగా వాటిని అభివర్ణించారు.

ఆయన పెద్దవారవుతున్న కొద్దీ, ఈ తపన దేవుని కోసం తీవ్రమైన అన్వేషణగా మారింది. యుక్తవయసులో ఉండగానే ముకుందుడు హిమాలయాల్లో గొప్ప సాధువులు నివసిస్తున్నారని, వారు ఆధ్యాత్మిక సాక్షాత్కారం వైపు తనను నడిపించగలరని నమ్ముతూ అక్కడకు చేరుకోవడానికి అనేక దృఢమైన, కానీ విజయవంతం కాని ప్రయత్నాలు చేశారు. ఈ ప్రయాణాలు బాహ్యంగా విజయవంతం కాకపోయినప్పటికీ, అవి ఆయన విశ్వాసాన్ని, సంకల్పాన్ని దృఢతరం చేశాయి. 1910లో, పదిహేడేళ్ళ వయసప్పుడు, ఆయన ప్రార్థనలు ఫలించి, తన దైవనిర్ణీత గురువు అయిన స్వామి శ్రీయుక్తేశ్వర్ ను కలుసుకున్నారు. ఆయన యొక్క కఠినమైనదే అయినప్పటికీ ప్రేమపూర్వక మార్గదర్శకత్వంలో, ముకుందుడు సంవత్సరాల తరబడి కఠోర ఆధ్యాత్మిక శిక్షణ పొందారు. విధేయత, ధ్యానం శరణాగతి ద్వారా, ఆయన తన జీవిత లక్ష్యం కోసం తయారయ్యారు. ఆ తర్వాత, ఆయన సన్యాసం స్వీకరించి, పరమహంస యోగానంద అనే పేరును పొందారు, భగవంతునితో ఏకత్వం ద్వారా పరమానందస్థితిని పొందడాన్ని ఈ పేరు సూచిస్తుంది.

మానవుని పోరాటం అంతాలోతుగా చూస్తేభగవంతుని కోసం అన్వేషణే అని యోగానంద బోధించారు. ఆయన ఇలా అన్నారు:

"మానవజాతి 'ఇంకేదో' తమకు ఆనందాన్నిస్తుందని, అది పరిపూర్ణము, అనంతము అయినదని భావిస్తూ ఒకానొక నిత్యాన్వేషణలో నిమగ్నమై ఉంది. భగవంతుణ్ణి వెతికి, కనుగొన్న ఆ వ్యక్తులకు అన్వేషణ పూర్తయింది: ఆ ఇంకేదో భగవంతుడే."

1917లో, శాస్త్రీయ ధ్యానం సమతుల్య ఆధ్యాత్మిక జీవనాన్ని వ్యాప్తి చేయడానికి ఆయన రాంచీలో యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా (వై.ఎస్.ఎస్.)ను స్థాపించారు. 1920లో, ఆయన యునైటెడ్ స్టేట్స్‌కు ప్రయాణించి, లాస్ ఏంజిలిస్ లో సెల్ఫ్-రియలైజేషన్ ఫెలోషిప్ (ఎస్.ఆర్.ఎఫ్.)ను స్థాపించారు. ఈ రెండు సంస్థల ద్వారా, ఆయన ఉపన్యాసాలు, కేంద్రాలు గృహ అధ్యయన పాఠాల ద్వారా శక్తివంతమైన క్రియాయోగం, ధ్యానం గురించిన బోధనలను ప్రపంచమంతటికీ విస్తరింపచేశారు. 30 సంవత్సరాలకు పైగా, పరమహంస యోగానంద పశ్చిమ దేశాలలో, భగవంతునిపై భక్తి, క్రమబద్ధమైన ధ్యానం అన్ని నిజమైన మతాల ఐక్యతను నొక్కిచెబుతూ, అవిశ్రాంతంగా బోధించారు,. కేవలం విశ్వసించడమే కాకుండా, భగవంతుడిని నేరుగా అనుభూతి చెందమని ఆయన సాధకులను ప్రోత్సహించారు. ఆయన ఆధ్యాత్మిక మహాగ్రంథం, ఒక యోగి ఆత్మకథ, లక్షలాది హృదయాలను స్పృశించి, ఆత్మలను ఈశ్వర సాక్షాత్కార మార్గం వైపునకు నిరంతరం ఆకర్షిస్తూ ఉంది. ఆయన రచనలు ప్రాచ్య, పాశ్చాత్య ఆధ్యాత్మిక సంప్రదాయాలలో ఒకేలా ఉన్న సార్వత్రిక సత్యాలను మరింతగా వెల్లడిస్తాయి. నేడు, ఆయన జయంతి సందర్భంగా, దివ్యమైన ఆయన మార్గదర్శనాన్ని కోరుకునే శ్రద్ధగల సాధకులు యోగానంద సాన్నిధ్యాన్ని అనుభూతి చెందుతూనే ఉన్నారు. శాశ్వత ఆనందం కోసమైన అన్వేషణభక్తి, క్రమశిక్షణ, దైవ కృప ద్వారాభగవంతుని యందే నెరవేరుతుందని ఆయన మనకు హామీ ఇస్తున్నారు.

# యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న ఆండవన్ స్వామీజీలు



ఇది కద నిజం, యాదగిరిగుట్ట: లక్ష్మీనరసింహ స్వామిని శ్రీ శ్రీ శ్రీ పర్వక్కొట్టాయి చిన్న ఆండవన్ స్వామీజీ, శ్రీమద్ ఆండవణ్ పౌండరిక పుర ఆశ్రమం, శ్రీరంగపురం స్వామీజీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామీజీలకు ప్రత్యేక స్వాగతం పలికారు. అనంతరం ఆలయ వంశపారంపర్య ధర్మకర్త భాస్కరాయని నరసింహ మూర్తి స్వామీజీలకు స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేశారు. తదుపరి వేద పండితులు వేద పఠనం నిర్వహించి స్వామీజీలకు వేదాశీర్వచనం చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఆందోళన ఇసుక కొరతపై నిరసన



ఇది కద నిజం, తాండూరు: యాలాల మండలంలోని 42 మందికి మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం ఇసుక కొరత కారణంగా ఆగిపోయిందని లబ్దిదారులు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు.లబ్దిదారులు మాట్లాడుతూ, ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణం స్లాబ్ దశ వరకు మాత్రమే పూర్తయింది. అయితే, ఇసుక సరఫరా సమస్య వల్ల నిర్మాణాలు ఆగిపోయాయని, దీనికి సంబంధించి అధికారులకు అనుమతులు ఇవ్వమని కోరినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి అభ్యర్థన ప్రకారం, ఇతర మండలాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక మంజూరు చేస్తుంటే, యాలాల మండలంలో అధికారులు పట్టించుకోవడం లేదని కూడా వారు పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు 30 కిలోమీటర్ల దూరం నుండి ఇసుక తీసుకురావాల్సిన పరిస్థితి అన్యాయమని, మండలంలోనే ఇసుక అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకట స్వామి లబ్దిదారులతో మాట్లాడుతూ, మండలంలోని కాక్రవేణి, కాగ్నానది ప్రాంతాల నుంచి ఇసుక అనుమతులు ఇవ్వలేమని, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల నుండి మాత్రమే ఇసుక తరలింపు మంజూరు చేయగలమని తెలిపారు.

# చిన్న అనంతగిరి శివాలయంలో
# మహాశివరాత్రి మహోత్సవాలకు సన్నాహక సమావేశం

- చిన్న అనంతగిరి శివాలయంలో మహాశివరాత్రి మహోత్సవాల ఏర్పాట్లపై ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహణ
- 14-02-2026 నుంచి 16-02-2026 వరకు మూడు రోజులపాటు మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకుల ప్రకటన
- శనివారం ఉదయం 4 గంటలకు గణపతి అభిషేకం, గణపతి హోమం, యజ్ఞంతో ఉత్సవాల ప్రారంభం
- ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా శివునికి ప్రత్యేక అభిషేకాలు, భక్తుల జాగరణ కార్యక్రమాలు
- సోమవారం ఆలయాన్ని పూలతో అలంకరించి సాయంత్రం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు



ఇది కద నిజం, చిన్న అనంతగిరి: చిన్న అనంతగిరి శివాలయంలో రానున్న మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రణవ భక్త సమాజం, హైదర్ గూడ వారి ఆధ్వర్యంలో చిన్న అనంతగిరి ఆలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రణవ భక్త సమాజ అధ్యక్షులు మోంగ్ర నర్సింహా అధ్యక్షత వహించారు.

15-02-2026 తేదీన జరగనున్న మహాశివరాత్రి మహోత్సవాలు మొత్తం మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల కార్యక్రమాలు 14-02-2026 శనివారం ఉదయం 4.00 గంటలకు గణపతికి అభిషేకం, గణపతి హోమం, యజ్ఞంతో ప్రారంభమవుతాయి. 15-02-2026 ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. 16-02-2026 సోమవారం ఆలయాన్ని పూర్తిగా పూలతో అలంకరించి, సాయంత్రం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. మూడు రోజుల పాటు నిరంతర భజనలు, జాగరణ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. భద్రత, పారిశుద్ధ్యం, నీటి వసతి తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో ప్రణవ భక్త సమాజం ఉపాధ్యక్షులు సనివేల్లి కృష్ణ, బర్ల మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, కోశాధికారి ఎస్.బీ. హరినాథ్, కార్యదర్శి కొండమీది హరినాథ్, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, కొలన్ సుభాష్ రెడ్డి, మ్యాడం రామేశ్వర్ రావు, మోంగ్ర కొమురయ్య, సీనియర్ జర్నలిస్ట్ మ్యాడం మధుసూదన్తో పాటు గుమ్మకొండ పెంటారెడ్డి, సనివేల్లి జయానంద్ రెడ్డి, సాబాధ విజయ్ కుమార్, మోంగ్ర అయిలయ్య, పెంటల సుధాకర్ రెడ్డి, కాకులారం కృష్ణ, కుక్కునూరి కిరణ్ చారి, చెట్టిగారి చిన్న, సులిగే విజయ్ కుమార్, కొండమీది నర్సింగ్ రావు, సోమవారం సురేష్, సులిగే మహేందర్, కాడెం శివకుమార్, తుల్జగారి శ్రీరాములు, రావుల జగన్, ఎల్. వెంకటేష్, కైల ప్రకర్ రెడ్డి, కొండమీది లింగం, సులిగే అశోక్, రమేష్, సార వెంకటేష్, కాడెం నర్సింగ్, గొరిగే రాజు, విజయ్ రావుత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కళాశాల ప్రిన్సిపల్స్ కృషి చేయాలి
### - యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు





ఇది కద నిజం, యాదాద్రి: సోమవారం రోజు మినీ మీటింగ్ హాల్లో జిల్లా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లడుతూ ప్రభుత్వము విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తునందున అదే దిశగా ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాలలో కనీస సౌకర్యాలు లైటింగ్,బెంచీలు,ఫ్యాన్లు, మంచినీటి,తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షల కోసం ల్యాబ్ మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున వెనకబడిన విద్యార్థులకు స్పెషల్ క్లాస్ లు ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా చూడాలన్నారు. పిల్లలకు అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలన్నారు. గత సంవత్సరం కంటే ఈసారి ఎక్కువ మంది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో ఉండేలా కళాశాల ప్రిన్సిపల్స్ కృషి చేయాలని అన్నారు. కళాశాలలో ఏమైనా సమస్యలు, మరమ్మత్తులు ఉంటే 20 రోజుల్లో పూర్తిచేయాలని ఆర్ అండ్ బి ఇంజనీర్లను ఆదేశించారు.

## రోడ్డు భద్రత కోసం పోలీస్ అవగాహన కార్యక్రమం



ఇది కద నిజం,వికారాబాద్: రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రజలు మరింత జాగ్రత్త పాటించాలి అని వికారాబాద్ పోలీసులు అభ్యర్థించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల నేపథ్యంలో ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రధాన కూడళ్లు, పాఠశాలల్లో ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించుతున్నారు. ప్రత్యేకంగా ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' (ఘటించిన వెంటనే ఫిర్యాదు, తక్షణ చికిత్స అవసరం) ప్రాధాన్యతను వివరించి, ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే '100'కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. అధికారులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి సహకారం ఉంటే రోడ్డు ప్రమాదాలను తగ్గించడం సులభమని తెలిపారు.

## చైనీస్ మాంజాపై ఉక్కుపాదం

- విక్రయించినా, నిల్వ చేసినా క్రిమినల్ కేసులు
- హైదరాబాద్ సీపీ సజ్జనర్



ఇది కద నిజం, హైదరాబాద్: సంక్రాంతి పండుగ వేళ నిషేధిత చైనీస్ మాంజా విక్రయాలు, వాడకంపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ తెలిపారు. పక్షుల స్వేచ్ఛకు, అమాయక వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తున్న ఈ ప్రమాదకరమైన మాంజాను ఎవరైనా రహస్యంగా విక్రయించినా, నిల్వ ఉంచినా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చైనీస్ మాంజా నియంత్రణ, తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి అధికారులకు సీపీ సజ్జనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు పండుగ పూట గాలిపటాలు ఎగురవేయడం సంప్రదాయమే అయినప్పటికీ, అది ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదని హితవు పలికారు. చైనీస్ మాంజా పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తోందని, ఇది మట్టిలో కలిసిపోక ఏళ్ల తరబడి అలాగే ఉండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ చట్టం-1986 ప్రకారం ప్రభుత్వం చైనీస్ మాంజా తయారీ, విక్రయం, నిల్వ, వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించిందని గుర్తుచేశారు. ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు నగరవ్యాప్తంగా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు. నగరంలోని అన్ని జోన్లలోని కైట్స్ విక్రయ కేంద్రాలు, చిన్న కిరాణా దుకాణాలు, అనుమానిత గోదాములపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహిస్తారని స్పష్టం చేశారు. కేవలం విక్రయదారులే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి అక్రమంగా ఈ నిషేధిత మాంజాను రవాణా చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు, పార్శిల్ సర్వీసులపైనా నిఘా పెంచామని, వారి ప్రమేయం ఉన్నట్లు తేలితే ఏజెన్సీ యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సీపీ సజ్జనర్ విజ్ఞప్తి చేశారు. చైనీస్ మాంజాలో ప్లాస్టిక్, ఇతర సింథటిక్ పదార్థాలతో పాటు గాజు పెంకుల మిశ్రమం పూతగా ఉంటుందని, దీనివల్ల ద్విచక్ర వాహనదారుల మెడలు తెగిపోవడంతో పాటు, పిల్లల వేళ్లు తెగిపోయే ప్రమాదం ఉందని వివరించారు. అంతేకాకుండా, ఇందులో ఉండే మెటాలిక్ పదార్థాల వల్ల విద్యుత్ తీగలకు తగిలినప్పుడు షాక్ కొట్టి పిల్లలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దయచేసి తల్లిదండ్రులు తమ పిల్లలకు సంప్రదాయ నూలు దారాలను మాత్రమే ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. నగర పౌరులు కూడా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సీపీ పిలుపునిచ్చారు. మీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు లేదా నిల్వ చేసినట్లు గమనిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి గానీ, హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నెంబర్ ०91 94906 16555 గానీ లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

## పరివర్తన రాజకీయాల కోసం ముందుకు రావాలి
# జై స్వరాజ్ పార్టీ పిలుపు



ఇది కద నిజం, హైదరాబాద్: నేటి రాజకీయాలు దోపిడీని ఎజెండాగా, అసభ్య పదజాలాన్ని ప్రచార అస్త్రాలుగా మార్చుకొని భ్రష్టు పట్టుతున్నాయని జై స్వరాజ్ పార్టీ ఆవేదన వ్యక్తం చేసింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు అనే తేడా లేకుండా రాజకీయాల్లో బూతులు తిట్టడమే ప్రశ్నించడం అన్న భావనను కల్పిస్తూ, పేదరికం, విద్య, వైద్యం, ఉపాధి, ఆవాసం వంటి ప్రజల ప్రధాన సమస్యలను పక్కన పెట్టేస్తున్నారని పార్టీ పేర్కొంది.సమాజంలో ఉన్న అనేక సమస్యలకు పేదరికమే ప్రధాన కారణమని, దానిని అంతం చేయడంపై ఏ ఒక్క పార్టీ కూడా స్పష్టంగా మాట్లాడటం లేదని జై స్వరాజ్ పార్టీ తెలిపింది. ఈ పరిస్థితిని మార్చేందుకు పరివర్తన రాజకీయాలు అవసరమని స్పష్టం చేసింది.ఇప్పటికే విజ్ఞులు, ఆలోచనాపరులతో చర్చలు జరుపుతూ ప్రజల ఉత్తమ ఆలోచనలతో ఉన్నత సమాజ నిర్మాణమే లక్ష్యంగా జై స్వరాజ్ పార్టీ ముందుకు సాగుతోందని తెలిపింది. ఈ కాలం పరివర్తన రాజకీయాలకు మూల మలుపు కావాలని, సరికొత్త రాజకీయ పంథానే సమాజానికి మార్గమని పేర్కొంది. సామాజిక స్పృహ ఉన్న మేధావులు, ఆలోచనాపరులు, దేశభక్తులు, మాజీ మావోయిస్టులు, కమ్యూనిస్టులు, జాతీయవాదులు, అంబేద్కరిస్టులు, ఫూలేఇస్టులు సహా దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ ప్రజా ప్రయోజనం కోసం ముందుకు రావాలని జై స్వరాజ్ పార్టీ పిలుపునిచ్చింది. అన్ని ఇజాలు దేశ అభివృద్ధికే అయితే, వాటిని హేతుబద్ధీకరించి సమాజ హితానికి వినియోగించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.రాబోయే ఎన్నికలే పరివర్తన రాజకీయాలకు పునాది కావాలని, "మనం మారితే సమాజం మారుతుంది, సమాజం మారితే వసుధైక కుటుంబానికి నాంది పడుతుంది" అనే నినాదంతో ప్రజలను ఉద్యమంలో భాగస్వాముల్ని కావాలని కోరింది. ఈ మహా సంకల్పానికి సహకరించాలని కోరుతూ, పార్టీ అభివృద్ధి కోసం విరాళాలు అందించవచ్చని, వాటికి 100 శాతం ఆదాయపు పన్ను మినహాయింపు (80 GGB / 80 GGC) ఉంటుందని పార్టీ తెలిపింది.వివరాలు:Account No: 75590200000663బ్యాంక్: బ్యాంక్ ఆఫ్ బరోడా (BOB), సాహెబ్ నగర్ శాఖIFSC: BARB0VJSAHEఈ మేరకు జై స్వరాజ్ పార్టీ అధ్యక్షులు రాజయోగి కేఎస్ఆర్ గౌడ (9492034203) ఒక ప్రకటనలో తెలిపారు.

## రైలు నుంచి జారి పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి




ఇది కద నిజం, తాండూరు: రైలు నుంచి జారిపడిన యువకుడు మహేష్ తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన వ్యక్తి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, మహేష్ ఓ కాంట్రాక్టర్ వద్ద విద్యుత్ పనులు చేస్తున్నాడు. ఉదయం వికారాబాద్ నుంచి తాండూరు వైపుగా రైల్లో ప్రయాణిస్తుండగా, ధారూరు సమీపంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ ఘటనతో అంతారం గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

## టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నేతలు



ఇది కద నిజం,వికారాబాద్: తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ కోర్టుకు వచ్చిన టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్‌ను నవాబ్‌పేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. బార్ కౌన్సిల్ ఎన్నికలపై చర్చించడంతో పాటు న్యాయవాదుల సమస్యలు, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కార్యకలాపాలపై పరస్పర అభిప్రాయాలను ఈ సమావేశంలో చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో పులుమామిడి గ్రామ సర్పంచ్ నర్సింలు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గణపురం ప్రసాద్, మీరజ్, వికారాబాద్ జిల్లాకు చెందిన న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు..

## చెట్టు కొమ్మల్లో సాయిబాబా రూపం ఆవిష్కరించిన మధులిక



నెల్లికుదురు, 05 జనవరి (ఇది కద నిజం): మండల కేంద్రంలోని రాజులకొత్తపల్లి గ్రామానికి చెందిన చిలుముల రాంప్రసాద్‌ఉసుజాత దంపతుల కూతురు చిలుముల మధులిక చిన్న వయసు నుంచే చిత్రకళపై అసాధారణమైన ఆసక్తి, ప్రతిభను ప్రదర్శిస్తూ అందరి మన్ననలు పొందుతోంది. ఇప్పటివరకు ఆమె గీసిన ఎన్నో అద్భుతమైన చిత్రాలు ఆమె సృజనాత్మకతకు నిదర్శనంగా నిలిచాయి. తాజాగా చెట్టు కొమ్మల్లో సాయిబాబా దేవుని రూపాన్ని చిత్రీకరించిన విధానం చూసిన ప్రతి ఒక్కరిని మంత్ర ముగ్ధులను చేస్తోంది. ఆ చిత్రంలో ప్రతిబింబించిన భక్తి భావం, కళా నైపుణ్యం, సృజనాత్మకత ఒకేసారి కనిపిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గ్రామ ప్రజలు, కళాభిమానులు మధులిక ప్రతిభపై ప్రశంసల వర్షం కురిపిస్తూ, భవిష్యత్తులో ఆమె జాతీయ స్థాయిలో ఖ్యాతి సాధించాలని హృదయపూర్వకంగా ఆకాంక్షస్తున్నారు.